


# అనుక్షణం

## – సృజన్ సేన్

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల
### (గతసంచిక తరువాయి)

**అతని ఆదాయ వ్యవహారాలన్నీ** ఆడిటర్ చూసుకుంటాడు. రోజువారి వ్యవహారాల లెక్కలు చిన్న గుమస్తా రాస్తుంటాడు. పూర్తి గవర్నమెంట్ ఉద్యోగం కాకపోయినా తమది క్వాజీ గవర్నమెంట్ అనేవారు. కాకపోతే ఇక్కడ పెన్షన్ రాదు. ఇప్పుడయితే గవర్నమెంట్ ఉద్యోగాల వారికి కూడా పెన్షన్ స్కీమ్ తీసేయటం జరిగింది. గతంలో పని చేసిన వారికి మాత్రమే. వారి భార్యలకి తదనంతరం బతికున్నంత వరకు పెన్షన్ వస్తుంది. అందుకే ఆ స్కీమ్ కావాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

అసలు ప్రభుత్వ ఉద్యోగాలు ఎక్కడ వున్నాయి? రిటైర్ అయిన వారి ఉద్యోగాలను భర్తీ చేయటం లేదు. అన్నీ ప్రైవేట్ పరం చేస్తున్నారు. ఇక ముందు పరిస్థితులు ఇంకా భయంకరంగా వుంటాయి. అంటే ఎవరైనా ఉద్యోగం చేస్తున్నప్పుడే ప్రణాళికలు వేసుకోవాలి. ఇప్పటి వరకు అంత దూరం ఆలోచించ లేదు.

అందుకే జీవితం తనకు ఓ అవకాశం యిచ్చింది అనుకున్నాడు. ఇంటి దగ్గర కళ్యాణి ఎదురు చూస్తోంది. ఆమె ముఖంలో ఏదో అర్జెంట్ గా చెప్పాలనే తపన కనిపిస్తోంది. అది గమనించాడు వెంకటాద్రి.

ఇంట్లో అడుగు పెట్టగానే ముందు కాఫీ యిచ్చింది.

"ఈ రోజు ఓ విశేషం వుంది" అంది కళ్యాణి.

"ఏమిటో అది".

"మా తమ్ముడికి డబ్బు అవసరం అని చెప్పాను కదా. ఇప్పుడు అలాంటిదేం లేదులే అని ఫోన్ చేశాడు".

"ఎందుకనో?"

"నా మరదలు వుంది కదా... అదే నా తమ్ముడి భార్య. తనని చిన్నప్పుడు వాళ్ల పెద్దమ్మ పెంచుకుంది. ఆమెకు పిల్లలు లేరని తెలుసుకదా మీకు".

''అవును''.

''పెద్దనాన్న ఈ మధ్య చనిపోయిన విషయం కూడా మీకు తెలుసు''.

''మనం కూడా వెళ్లి వచ్చాం దినానికి. ఇందులో విశేషం ఏంటి?''

''ఇప్పటి వరకు వారి ఆస్తులు ఎవరికీ పంచలేదు. మరదలు వనిత పెదనాన్న తరపున కొంతమంది బంధువులున్నారు. వారికి ఆస్తి పంపకం చేస్తారు అనుకునేవారు. ఇప్పుడు వనిత పెద్దమ్మ రెండు ఎకరాల భూమి, అలాగే గుంటూరులో ఓ ఇల్లూ, వనిత పేరు మీద రాశారంట''.

''ఓ! మంచి వార్తేగా! అయితే పెదనాన్న తరపు వాళ్లు చూస్తూ వూరుకుంటారా? కోర్టుకి వెళ్తారేమో?''

''అలా వెళ్లటానికి అవకాశం లేదు లెండి. అవన్నీ పెద్దమ్మ పేరు మీద వున్నాయి. అందులోనూ అవి పుట్టింటి వారు ఇచ్చినవి. ఇంకా స్థలాలు కూడా వున్నాయంటున్నారు. వాళ్లు ఇలాంటి గొడవలు మొదలు పెడితే అవి కూడా వనిత పేరు మీద రాసి పారేస్తుంది. తిక్క వదులుతుంది. అయినా కోర్టులకి వెళ్తే ఎప్పటికి తేలేను''.

''గుంటూరులో ఇల్లంటే మంచి ధర వస్తుంది''.

''ఇప్పుడేం అమ్మరు కదా. పొలాలు కూడా మంచి ధర పలుకుతాయి. ఇంక వారి సమస్యలన్నీ తీరిపోయినట్లే. ఎంత లేదన్నా ఈ రోజు కాకపోతే రేపు తమ్ముడు వాళ్లకి కోటి రూపాయల పైన వస్తుంది. అయినా తమ్ముడికి ఇద్దరూ ఆడపిల్లలు. ఇంక వారి పెళ్లిళ్ల గురించి ఆలోచించే పని లేదు. నేను నిన్న కూడా అన్నాను కదండి. పై నుండి భగవంతుడు అన్నీ చూస్తుంటాడు. ఎప్పుడు ఎవరికి ఎలా ఇవ్వాలో తనకి తెలుసు అని''.

''అంటే నిన్ను పెంచుకున్న వాళ్లో, వనిత పెద్దమ్మ లాంటి వారో నీకూ వున్నారా? నువ్వు మన గురించి మాట్లాడావనుకున్నాను. కొంప తీసి మీ తమ్ముడు తమకు వచ్చిన ఆస్తిలో నీకు కొంత వాటా యిస్తాడా?''

''మీరు భలేవారే. అసలు అలా అనుకోవటం తప్పు. ఆ ఆస్తి మా మరదలిది. దాన్నుండి నాకు ఎలా వస్తుంది. అయినా మా అమ్మా నాన్నల నుండి వచ్చిన ఆస్తి కాదు. మా బంధువుల నుండి వచ్చింది కాదు. మా తమ్ముడు ఈ సందర్భంలో మీకూ నాకూ బట్టలు పెడితే తీసుకుంటాం. అంతేగాని ఆస్తి తీసుకోవటం ఏంటి?''

''దీన్ని ఏమంటారు?''

''అంటే?''

''నడమంత్రపు సిరా?''

''అదెలా అవుతుంది. వనిత పెదనాన్న వాళ్ల మనుషులు అలా అనుకుంటే అనుకోవచ్చు. చిన్నప్పటి నుంచి వనితని వాళ్లు పెంచుకున్నారు. చదివించారు. పెళ్లి ఖర్చుల్లో ఎక్కువ వారే భరించారు. ఈ రోజు కాకుంటే రేపు ఆ ఆస్తి వనితకు రాస్తారని ముందు నుండి అనుకుంటుందే''.

''ముందు నుండి అనుకుంటే అది నడమంత్రపు సిరి అవదా?''

అప్పుడు అదోలా చూసింది.

"మా తమ్ముడు వాళ్లకి ఇలా కలిసి రావటం మీకు నచ్చటం లేదా?"

"ఇది బాగానే వుంది. బావ మరిది బతుకు కోరతాడు అంటారు. అందులోనూ మీ తమ్ముడు ఆనందరావుకి నేనంటే ఇష్టం. ఇంతకు ముందు ఓ సారి డబ్బులు సర్దాడు. మామూలుగా జనం అనుకుంటారు కదా! అనుకోకుండా ఇలాంటి అవకాశాలు మీద పడటం గురించి. దాని గురించి అంటున్నాను".

"అలాంటి మనుషులుంటారు. అందుకే అలాంటి వాటిని పెద్దలు చెప్పారు. ఇదంతా తమ ప్రతిభ అనుకుంటారు. కోటో, పది కోట్లో మనుషులకి రావచ్చు. తప్పు లేదు. అక్కడ నుండి కళ్లు నెత్తి మీదకి రాకూడదు. ఎదుటి వారిని మనుషులుగా చూడటం మానకూడదు. ఇంక మాకేంటి ఇతరుల్తో పని. మా దగ్గర డబ్బుంది. దీంతో ఏమైనా చేయగలం. ఎవరినయినా కొనగలం అనుకున్నప్పుడు సమస్యలు వస్తాయి" అంది కళ్యాణి.

"మంచి వార్త చెప్పావు. సంతోషం" అని స్నానానికి వెళ్లాడు.

రాత్రి అతనికి చాలా సేపు నిద్రపట్టలేదు.

చిన్నప్పుడు మిత్రులతో కలసి డబ్బులు దొరుకుతాయని కొన్ని ప్రాంతాలకు వెళ్లి వెతకటం గుర్తొచ్చింది. అసలు మనిషిలోనే ఓ బలహీనత వుంది. తమకు కలిసి రావాలనుకుంటారు. అది వారసత్వం ద్వారానో, ఇలాంటి బంధుత్వాల ద్వారానో, స్నేహాల ద్వారానో, లాటరీలో, ఇంకోటో! అందుకు దేవతలను ప్రార్థించేవారూ, మొక్కుకునేవారూ, చివరకు గుప్త నిధుల కోసం బలులు ఇవ్వటానికి తయారయ్యేవారూ సమాజంలో వున్నారు.

ఆనందరావుకీ, తనకూ కలిసి వచ్చింది.

రెండూ ఒకటేనా? ఎలా అవుతాయి!

వాళ్లు బయటకు చెప్పుకోగలుగుతున్నారు. తను చెప్పుకోలేదు. ఇప్పుడు ఆస్తులు రిజిస్టర్ చేయటానికి గిఫ్ట్ కింద కొంత ఖర్చు అవుతాయి. అదేమంత పెద్ద మొత్తం కాదు. అక్కడ నుండి రైట్ రాయల్ గా అనుభవిస్తారు. నిజానికి తనకు వచ్చింది నడమంత్రపు సిరి. ఇది ఖర్చు చేయటానికి వెనకాల అనేక సమస్యలు. దొంగనోట్లా? ఇంకెక్కడి నుండన్నా దోచుకున్నవా? ముందు లెక్కలు చూపాలి. ఇలాంటి సమస్యలున్నాయి. ఆనందరావు అదృష్టవంతుడు. తను అదృష్టవంతుడో కాదో కాలం మాత్రమే చెబుతుంది అనుకున్నాడు వెంకటాద్రి.

ఇంతకూ వారికి ఇలా కలిసిరావటం తనకు సంతోషాన్ని కలిగించిందా అన్న ప్రశ్న అతనికి ఎదురయింది. వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. తనకు ఏభై లక్షల రూపాయలు దొరికాయని ఆనందరావుకి తెలిస్తే ఏమనుకుంటాడు? సంతోషపడతాడా? బేవర్స్ డబ్బు అంటాడా! తమ ముఖం మీద అనకపోవచ్చు. అలాకాదు మా అక్క కుటుంబానికి వచ్చాయి కాబట్టి, మేనల్లుడు, మేనకోడలు అదృష్టవంతులు అనుకుంటాడా. ఏమో! ఎవరు చెప్పగలరు. మనుషుల మనసులో ఒకటి వుంటుంది. బయటకు మరొకటి చెబుతారు.

నిరంజన్ ఆఫీస్ లో చెప్పాడు.

"మనం రేపు ఫ్లయింట్ లో బెంగళూరు వెళ్తున్నాం. ఇక నుండి మనం ట్రావెల్ చేయాల్సి వుంటుంది. నువ్వు ఇక్కడ వున్నప్పుడు ఎకౌంట్స్ చూడవచ్చు. ఇక నుండి నువ్వు నీ రూట్ మార్చుకోవాలి".

"తప్పకుండా నిరంజన్ గారూ... నాకు కూడా అవసరాలు పెరుగుతున్నాయి. నేను ఏదో ఒకటి చేయాల్సిన సమయం వచ్చింది" అన్నాడు వెంకటాద్రి.

అప్పుడు అతను నువ్వు ఇన్వెస్ట్ చేస్తున్నావా అని అడగలేదు. నిరంజన్ గంభీరంగా వుంటాడు. అతను ఎదుటివారిని ఎలా అంచనా వేస్తాడు అనే విషయం తెలియనివ్వడు. అన్ని విషయాల్లో సిన్సియర్ గా వుంటాడు. ముఖ్యంగా పేమెంట్ విషయంలో పక్కాగా వుంటాడు. నెల మొదటి రోజున శాలరీస్ యిస్తాడు. అదే సమయంలో తనకు కావాల్సిన వర్క్ ని రాబట్టుకుంటాడు.

ఆఫీస్ లో ఓ డీసెన్సీ వుండేలా చూసుకుంటాడు. అతని ప్రైవేట్ జీవితం కూడా నియమ బద్ధంగా వుంటుందని చెప్పుకుంటారు. అంతకు మించి పెద్ద విశేషాలు తనకు తెలియవు.

సాయంకాలం శివ నుండి ఫోన్ వచ్చింది.

"ఈ రోజు నాకు కుదరటం లేదు. నువ్వు వాకింగ్ కి వెళ్తావా?"

"అలాగే. అన్నట్లు రేపు నేను మా బాస్ తో కలిసి బెంగళూరు వెళ్తున్నాను. రెండు రోజులన్నారు. ఇంకో రోజున్నా ఆశ్చర్యం లేదు".

"గుడ్. నేను నీకు ముందే చెప్పాను కదా!" అన్నాడు శివ.

ఈ రోజు వాకింగ్ మానేస్తే అనుకున్నాడు. అంతగా అయితే డాబా మీద నడుస్తాను అనుకున్నా, బెంగళూరులో పరిస్థితి ఎలా వుంటుందో తెలియదు. అక్కడ కుదరకపోవచ్చు అనిపించింది. అందుకని ఒంటరిగానే బయలుదేరాడు.

రాత్రి తొమ్మిది గంటలు దాటాక అక్కడికి కొంత మంది వస్తుంటారు. వాళ్లు యువకులు కావచ్చు. వాళ్లు నడుస్తున్నప్పుడు ఖాళీ బీరు బాటిల్స్ కనిపిస్తుంటాయి. అలాగే మద్యానికి చెందిన ఇతర బాటిల్స్ కూడా. కొంతమంది రోడ్ల మీద వాటిని బద్దలు కొడుతుంటారు. రాత్రి పూట పోలీసులు ఆ ప్రాంతాలు వస్తుంటారా అనేది అనుమానమే. అయినా కంప్లయింట్ ఇస్తే బాగుంటుంది అనిపిస్తుంటుంది.

వెంకటాద్రి నడుస్తుంటే 'ఆరుగురు అనుమానితులు' పుస్తకం, శివ చెప్పింది గుర్తుకు వస్తోంది. పుస్తకాలు చదవటం చాలా అవసరం. అందులోనూ క్రైమ్ నవలలను చదవాలి. అందువల్ల ఎన్నో విషయాలు తెలుస్తాయి. ముఖ్యంగా వైట్ కాలర్ నేరాలు బాగా పెరుగుతున్నాయి. అవి ఓ స్పృహను కలిగిస్తాయి. ఇతరుల్ని మోసం చేయటానికి కొంత మంది అలాంటివి చదవొచ్చు. అలా మోసపోకుండా వుండటానికి కూడా అవే చదవాలి.

అందులో దొంగను పట్టుకున్నారు అన్నాడు. అందుకు వారు ఎలాంటి పరిశోధన చేసుంటారు. అనే ఆలోచన వచ్చింది. అంత డబ్బు చూడగానే ముందు ఆ షాక్, ఆ సంతోషం నుండి బయట పడటం కష్టం. ముందు అతను వాటిని దాయాలి. ఆ దొంగకి ఇల్లు వుందా? సంసారం వుందా? అమ్మా నాన్నలు వున్నారా? అతను స్లమ్ లో వుంటున్నాడా? అదయితే అంత డబ్బు దాయటం మరింత కష్టం. ఇంతకూ అతనికి దొరికింది ఎంత డబ్బు!

ఏభై లక్షలా? అంత చిన్న మొత్తం అయి వుండదు. అయినా ఆ సూట్ కేసు ఎంతదో. అందులో కనీసం కోటి నుండి రెండు కోట్లు వుండుంటాయా? ఇంతకీ ఈ నవలని ఎప్పుడు రాసుంటారు. పెద్ద నోట్లని రద్దు చేయక ముందా? అంతే అయుండాలి. అంటే వెయ్యి రూపాయల నోట్లు అయివుండాలి. ఇప్పుడు అలాంటివి దొరికినా విలువేముంది. అవి చిత్తు కాగితాల కింద లెక్క.

అందుకని అతను వాటిని దాయటానికి శ్రమపడి వుండాలి. తను సెల్ ఫోన్లు దొంగతనం చేసేది తన కోసం కాదు కదా.  ఎవరికో అమ్మాలి. అందుకు కథ చెప్పాలి–కొత్త కస్టమర్లయితే. లేదంటే అలాంటి సొమ్ముని అంటే బంగారాలని, ఫోన్లని, బైకుల్ని కొనేవారుంటారు. వారికి ఇలాంటి దొంగల గురించి తెలిసిపోతుంది.

అందుకని అతను తెలివిగల దొంగ అయితే ముందు కొంత డబ్బు తీసుకుని ఆ నగరం అన్నా వదలాలి. ఆ ప్రాంతమన్నా వదలాలి. అలాగే అప్పటి దాకా తను రోడ్ల మీద అమ్మే బట్టలు కొనుక్కుని వుంటాడేమో. ఇప్పుడు డిజైనర్ బట్టలు తీసుకోవాలనుకుంటాడు. అక్కడ నుండి ఏదొక రోజు తెలిసిన వారు కనిపిస్తారు. వారికి అనుమానం వస్తుంది. ఇలాంటిదేదో జరిగి వుంటుంది. ఏమైనా ఆ నవల చదవాలి.

అప్పుడు వెంకటాద్రి ఆగిపోయాడు. తనకు బ్యాగ్ దొరికిన చోట ఓ మనిషి కనిపించాడు. అతను అటూ ఇటూ చూస్తున్నాడు. అనుమానం వచ్చింది. అంటే వెతుకులాట మొదలైందా? ఈ ప్రాంతాన్ని గుర్తుపట్టాడా? ఇప్పుడు తనేం చేయాలి? ముందుకు కదలటమా? వెనక్కి తిరగటమా? వెనక్కి తిరిగితే అతనికి అనుమానం రావచ్చు. తనను ఫాలో కావచ్చు. అందుకని ముందుకే నడిచాడు.

అతను ఒంటేలు పోసుకుంటున్నాడు. అందుకా అటూ ఇటూ చూసింది! అది నటనా! తను ముందుకు కదిలినా క్రీగంట అతన్ని గమనిస్తున్నాడు. కాస్త గడ్డం పెరిగి వుంది. ముప్పై సంవత్సరాలు దాటి వుంటాయి. రఫియన్ లా వున్నాడు. ఇదంతా చూస్తుంటే రెక్కీలా వుంది. ఇతను ఈ ప్రాంతాలన్నీ గాలిస్తాడనుకుంటా! వెంకటాద్రి దగ్గర సెల్ ఫోన్ వుంది. అతని ఫోటో తీస్తే ఎలా వుంటుంది అనుకున్నాడు. అది సరయింది కాదని అప్పుడే అనిపించింది.

అతను తిరగబడతాడు. జనం కూడా లేరు. తనని కొట్టి సెల్ ఫోన్ ని లాక్కోవచ్చు. అప్పుడే ఏదో శబ్దం. దూరంగా బైక్ వస్తోంది. అతను వెనక్కి తిరిగి ఏదో లోకంలో వున్నట్లు నడుచుకుంటూ పోతున్నాడు. వెంకటాద్రి మరో అరకిలో మీటర్ నడిచి వెనక్కి తిరిగాడు. దారిలో తిరిగి అతను కనిపిస్తాడేమోనని చూశాడు. లేదు. ఇంటికి వచ్చాక కళ్యాణిని బట్టలు సర్దమందాం అనుకుని ఆగాడు.

ఇప్పుడు ఆ సూట్ కేసుని తీద్దాం అంటుందేమో!

అప్పుడు అసలు రహస్యం బయటపడుతుంది. అయినా అది పాతది. బరువుగా వుంటుంది. అప్పట్లో ఫర్వాలేదు గాని ఇప్పుడు ఆ బరువు మోయటం కష్టం. పైగా ఇప్పటి బాగ్స్ ల్లా, సూట్ కేసుల్లా దానికి చక్రాలు లేవు.

"ఎవరికన్నా ఇచ్చేయ్ కళ్యాణి" అన్నాడో సారి.

"ఎందుకండి ఇవ్వటం. అది కొన్నప్పటి ఆనందం నాకు ఇంకా గుర్తుంది. మనకి కూడా సూట్ కేసుంది అన్న గర్వం కలిగింది. అదలా గుర్తుగా వుండనివ్వండి" అంది.

పిల్లలకి ఇద్దాం అనుకున్నా అది మరీ బరువు. బ్రాండెడ్ కూడా కాదు. ఇప్పుడది మళ్లీ విలువను పెంచుకుంది. అందులో ఏభై లక్షల రూపాయలు వున్నాయి. తర్వాత సూట్ కేస్ కల్చర్ తగ్గు ముఖం పట్టింది. ఇప్పుడు బ్యాగ్ లు వచ్చాయి. అందులో రకరకాల బ్రాండ్స్. అలాంటివి కొన్నారు.

"నేను రేపు బెంగళూరు వెళ్తున్నాను మా బాస్ తో, అక్కడ కనీసం రెండు రోజులుండాలి. అందుకని బట్టలు సర్దుకోవాలి. నేను బ్యాగ్ తీస్తాను" అన్నాడు.

అది కూడా అటక మీద వుంది. ఓ మూలగా సూట్ కేస్ కనిపించింది. అప్పుడనిపించింది. ఇప్పుడీ విషయం చెబితే కళ్యాణి భయపడుతుంది. రెండు రోజులు ఒక్కతే వుండాలి. తమ దగ్గర టైం బాంబ్ వుంది. మరికొద్ది నిముషాల్లో పేలుతుంది అంటే ఎవరి మానసిక పరిస్థితయినా ఎలా వుంటుంది!

"ఇదేంటి కొత్తగా" అంది బట్టలు తీస్తూ.

"ఇక నుండి కొత్త జీవితమే".

"నాకు అర్థం కాలేదు".

"బెంగళూర్ లో మా నిరంజన్ గారు భూమి తీసుకుంటున్నారు. అక్కడ వెంచర్ వేస్తున్నారు. అందుకని నన్ను తనతో తీసుకు వెళ్తున్నారు. ఇక నుండి ఉదయం తొమ్మిదింటికి వెళ్లి అయిదు గంటలకి ఇంటికి రావటం కుదరదు. ఈ వెంచర్ సక్సెస్ అయితే ఇంకొన్ని తీసుకుంటారు. నన్ను తనతో ట్రావెల్ చేయమంటున్నారు" అన్నాడు వెంకటాద్రి.

"ఇంత ఆలస్యంగా చెబుతున్నారేంటి? కనీసం ఇంటికి రాగానే చెప్పినా పిల్లలకి ఏదొకటి వండేదాన్ని. వాళ్లను కలుసుకునే అవకాశం వుంటుందా? మన పిల్లలు అక్కడ చదువుకుంటున్నారని వారికి తెలుసా?"

"తెలుసు. మనకు బొత్తిగా పరిచయం లేని మనిషి కాదుగా. పిల్లల్ని కలుసుకునే అవకాశం వుంటుందో లేదో తెలియదు. అందుకే నువ్వు ఏదొకటి చేస్తానంటావని అనలేదు".

"ఎక్కడ వుంటారు?"

"తెలియదు. బహుశా హోటల్ లో వుంటాం అనుకుంటాను. ప్రస్తుతం మాకు అక్కడ గెస్ట్ హౌస్ లాంటిది లేదు. ముందు ముందు తీసుకుంటారేమో. అక్కడ కూడా ఆఫీస్ తెరవాల్సి వుంటుందేమో".

"మనల్ని అక్కడ వుండమంటారేమో?"

"ఏమో... చెప్పాను కదా. ఇవేవీ తెలియవు. అన్నీ మొదట్లో అడగలేం కదా. ఏ మాత్రం వీలు దొరికినా పిల్లల్ని కలుస్తాను. అదలా వుంటే నీకో విషయం చెప్పాలి".

"ఏంటండి అది?" అంది ఉత్సాహంగా.

"ఇంత వరకు ఆయనకు పార్ట్నర్స్ లేరు. ఆయన మనకో ఆఫర్ యిచ్చారు. ఇందులో నువ్వు ఎంత ఇన్వెస్ట్ చేయాలనుకుంటే అంత చేయవచ్చు అని".

"నిజంగానా! మన దగ్గర అంత డబ్బు వుందని తను అనుకుంటున్నారా?"

"మన రిటైర్ మెంట్ తర్వాత వచ్చిన ఎమౌంట్ గురించి ఆయనకి.... " అంటుండగానే...

"మనం ఇల్లు కొనుక్కుందాం అనుకున్నాం" అంది.

వెంకటాద్రి సైలెంట్ అయిపోయాడు.

"చెప్పండి" అంది కళ్యాణి.

"అన్నీ నువ్వే మాట్లాడుతుంటే నన్నేం చెప్పమంటావు. ఆయన ఇలా అన్నారు అంటున్నాను. ఇంతలో... ".

"సారీ సారీ... "

"ఆ డబ్బులుంటాయి కదా. లేదా మీ సేవింగ్స్ వున్నా నువ్వు పెట్టవచ్చు. అది పాతికా, ఏభైనా నీ ఓపిక. నాకు ఇష్టమైన ఒకరిద్దరికి ఇందులో అవకాశం ఇవ్వాలనుకున్నాను. అన్నారాయన. నేను అలా అని అనలేదు. నీతో మాట్లాడాలి. అలానే మనం చర్చించుకోవాలి" అన్నాడు.

"అది మొత్తం ఎన్ని లక్షలు?"

"లక్షలు కాదు. కోట్లు వుంటుంది. మనం ఇప్పుడు మూడు వందల గజాలు తీసుకోవాలంటేనే లక్షలు అవుతాయి. అయినా భూమి మీద పెట్టుబడి పెడితే నష్టం వుండదు".

"పిల్లలు ఏమంటారో?"

"వాళ్లు చదువుకుంటున్నారు. ఇప్పట్నుంచే వారికి ఇలాంటి విషయాల గురించి ఎందుకు? వాళ్ల పెళ్లిళ్లయి, సంపాదన మొదలయినప్పుడు ఆలోచించుకుంటారు. నీ సంగతి చెప్పు".

"మనకేనా ఇంకెవరికన్నా ఇస్తారా?"

"అంటే?"

"మా తమ్ముడికి చెబుదాం. వాళ్లకి ఇప్పుడు ఆస్తులు వచ్చాయి కదా. పెట్టుబడి పెడతారేమో".

"ఛ... నోర్ముయ్" అన్నాడు అప్రయత్నంగా.

కళ్యాణి అదిరిపోయింది.

"ఆయన మనకేదో ఛాన్స్ ఇస్తానన్నారు. అయితే మా బామ్మర్దికి ఇస్తావా, మా మేనమామకిస్తావా అని అడగమంటావా. వాళ్లకి ఆస్తులు రాసిచ్చింది వెంటనే అమ్ముకుని ఇంకో చోట కొనమనా. అందులో ఏముందో తెలియదు. తన తదనంతరం అనుండవచ్చు. ముందామెని చూసుకోవాలి. ఇంటికి తీసుకొచ్చి పెట్టుకోవాలి. అయినా నీ తమ్ముడు నిన్ను సలహా అడిగాడా?. మాట్లాడే ముందు కాస్త ఆలోచించాలి" అన్నాడు కోపంగా.

కళ్యాణికి కళ్ల వెంట నీళ్లు వచ్చాయి.

"ఏడుపులు మొదలు. ఇలాంటివి నాకు నచ్చవు".

"నేనేదో అన్నాను. మెల్లగా చెప్పవచ్చు. ఇన్ని మాటలు అనాలా?"

"ఏంటి మెల్లగా చెప్పేది. మన విషయాలు మనం చూసుకుంటే చాలు. ఇతరుల గురించి మనకెందుకు?"

"వాళ్లు ఇతరులు ఎలా అవుతారు?"

"అంటే నువ్వు వెళ్లి వాళ్ల ఇంటి విషయాలన్నీ చక్క బెట్టిరా. నువ్వు అక్క గారివి కదా. ఇలాంటి విషయాల్లో తల దూర్చటం ఏంటి? మేం వ్యాపారం చేయాలనుకుంటున్నాం. మీరు సలహా ఇవ్వండి అన్నారా? ఎవరి లిమిట్స్ లో వాళ్లుండాలి. మనకు అయిన వారు. అప్పుడప్పుడు అక్కడికి వెళ్తాం. శుభకార్యాలు, అశుభాలుంటాయి. అంతవరకే. వాళ్లకేదో కలిసి వచ్చిందని అత్యుత్సాహం చూపించకు. అభాసుపాలవుతాం".

కళ్యాణి చీరకొంగుతో కళ్లు అద్దుకుంది.

ఇంతలో ఫోన్ మోగింది.

అది వెంకటాద్రి సెల్ ఫోన్. బెంగళూరు నుండి కొడుకు చైతన్య చేశాడు.

"ఎలా వున్నారు నాన్నా. అమ్మ వచ్చింది కదా. ఈ మధ్య నాకు ఫోన్ చేయటం కుదరలేదు. అసలు తీరటం లేదు కూడా!"

"అమ్మ వచ్చిందిరా. అన్నట్టు నేను రేపు మా బాస్ తో కలిసి బెంగళూరు వస్తున్నాను".

"నిజమా... ఎక్కడ దిగుతున్నారు?"

"తెలియదు. అక్కడికి వచ్చాక వీలు చూసుకుని ఫోన్ చేస్తాను. మనం కలవటం కుదరకపోవచ్చు. దీప్తి బాగానే వుందిగా".

"తను బాగానే వుంది. అప్పుడప్పుడు మాట్లాడుకుంటున్నాం. అమ్మకిస్తారా?"

"తను నా బట్టలు సర్దుతోంది. రేపు తీరిగ్గా మాట్లాడుకోండి. ఇంకా నాకు పనులున్నాయి. భోజనం కూడా చేయలేదు" అని కట్ చేశాడు.

"ఇప్పుడు నువ్వు ఏడుస్తూ మాట్లాడితే ఇక్కడేం జరిగిందో అని పిల్లలు కంగారు పడతారు" అన్నాడు వెంకటాద్రి.

జీవితంలో వెంకటాద్రి మొదటి సారిగా విమానం ఎక్కటం జరిగింది. ఇద్దరూ పక్కపక్కన కూర్చున్నారు. విమానం గాల్లోకి లేస్తున్నప్పుడు ఆ కుదుపుకి కాస్త భయం అనిపించింది. అందులోనూ నిరంజన్ తనకి విండో సీట్ యిచ్చాడు.

''ఇంతకు ముందు ఫ్లయిట్ లో ట్రావెల్ చేశావా?'' అన్నాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS